కాంగ్రెసోళ్లు ఏ మొఖంతో ఓట్లడుగుతరు

- రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది..
- మహిళలకు నెలకు రూ.2500 సాయం ఎటుపోయింది..
- వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి..
- గ్యారెంటీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్
- దేవుడి పేరుతో మతరాజకీయాలు చేస్తున్న బీజేపీ
- మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం
- చిన్నశంకరంపేటలో బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 5 : ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెసోళ్లు ఎంపీ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని వచ్చి ఓట్లడుగుతారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలోని శ్రీనివాస్ గార్డెన్‌లో శుక్రవారం మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. 6 గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, వంద రోజులు దాటినా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మహిళలకు రూ. 2500 సాయం, వృద్ధులు, వితంతువులకు రూ. 4000 పింఛన్ ఇస్తామని చెప్పి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రూ.4 వేల చొప్పున పింఛన్ రాని వారంతా కారుగుర్తుకు ఓటేసి కాంగ్రెస్ తగిన బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మెదక్ ఎంపీగా గెలుపొందడం ఖాయమన్నారు. బీజేపీ దేవుడి పేరుతో ఓట్లను దండుకోవాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 400 రూపాయలు ఉన్న గ్యాస్ ధర వెయ్యి రూపాయలకు, 60 రూపాయలు ఉన్న పెట్రోల్ ధర రూ.110కి పెంచిన ఘనత బీజేపీదే అన్నారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేమి లేదన్నారు.

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

గెలిచిన నెలరోజుల్లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తా..

–మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

ఎంపీగా గెలిచిన నెలరోజుల్లోనే రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తానని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు కోచింగ్ ఇప్పిస్తానని, నియోజకవర్గంలో ఒక ఫంక్షన్‌హాల్ నిర్మించి రూపాయి ఖర్చులేకుండా శుభకార్యాలను చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాలు తనకు తెలుసు అని, పేదలకు అండగా ఉంటానన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలకు మోసపోవద్దు

–మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఓడినా గెలిచినా తాను ప్రజల మ ధ్య ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఏకే గంగాధర్ రావు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జడ్పీటీసీలు మాధవి, కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు సత్యనారాయణగౌడ్, సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుమార్ గౌడ్, నాగరాజు, లక్ష్మణ్, భిక్షపతిగౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న బాల్‌రాజ్‌గౌడ్, కొండల్‌గౌడ్ దంపతులు

నిజాంపేట, ఏప్రిల్ 5 : నిజాంపేటలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవం బాల్‌రాజ్‌గౌడ్ దంపతులు, కొండల్‌గౌడ్ దంపతులు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ జమదగ్ని మహిర్షి ఉత్సవ విగ్రహాలకు పురోహితులు విశ్వేశ్వర శర్మ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు,భక్తులు పెద్ద ఎత్తున ఆలయం విచ్చేసి రేణుకాఎల్లమ్మ కల్యాణం తిలకించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోసం దాతలు బాలరాజ్‌గౌడ్,కొండల్‌గౌడ్ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రామాయంపేట, ఏప్రిల్ 5 : అక్రమంగా ఎలాంటి అనుమతి లేకుండా ఓ లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు రామాయంపేట ఎస్సై.రంజిత్ అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా, అటుగా వస్తున్న లారీని తనిఖీ చేయగా ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యంగా గుర్తించారు. బియ్యం సుమారు 16 క్వింటాళ్లు ఉంటాయన్నారు. పట్టుకున్న బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకుని లారీ ఓనర్ మహేందర్, డ్రైవర్ షేక్ సర్దార్‌లపై కేసులు నమోదు చేశారు. రేషన్ బియ్యం కొనడమే గాకుండా గత కొంత కాలంగా ఫౌల్ట్రీ ఫామ్‌లకు తరలిస్తున్న సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై. రంజిత్ తెలిపారు.

పట్టుకున్న రేషన్ బియ్యం లారీతో ఎస్సై కానిస్టేబుల్

గిరిజన తండాలో భోగ్‌భండార్

రామాయంపేట గిరిజన తండాలో పూజలు చేస్తున్న గిరిజనులు

రామాయంపేట, ఏప్రిల్ 5 : రామాయంపేట మున్సిపల్ పరిధిలోని గిరిజన తండాతో పాటు వివిధ గిరిజన వాసులు తండాల్లోని సేవాలాల్ గిరిజన మాలదారులు, గురువులు భోగ్‌భండార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తండాల్లోని సేవాలాల్ మహారాజ్ గుడిలో స్వామివారికి పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి తండాలో ఉన్న గిరిజన సేవాలాల్ భక్తులు ఇంట్లో పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యంగా స్వీట్లను తయారు చేశారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించి, మంగళహారతులు అం దించారు.

కరాటేలో జూకల్ విద్యార్థుల ప్రతిభ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 5 : జిల్లా కేంద్రమైన మెదక్‌లో జరిగిన రెన్షాకీ శుటోకాన్ కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో పెద్దశంకరంపేట మండలం జూకల్ గ్రామానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి గ్రీన్ ఆరెంజ్ బ్రౌన్‌బెల్ట్‌లను సాధించారు. జూకల్ గ్రామానికి చెందిన మధు ప్రియ, సంతోష్ గ్రీన్‌బెల్ట్‌లు సాధించగా, చరణ్ ఆరెంజ్ బెల్ట్, మల్లేశం బ్రౌన్ బెల్ట్‌లను సాధించారు. కరాటే గ్రౌండ్ మాస్టర్ నగేశ్, విద్యాసాగర్, కరాటే మాస్టర్ పరుశురామ్, తదితరులు ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సామూహిక సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 5 : మండల కేంద్రమైన కొల్చారంలోని శివాలయం మూడో వార్షికోత్సవం సత్యనారాయణ వ్రతాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగరపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో నూట ఎనిమిది జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మాధవానంద సరస్వతీస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మురళీధర్ శర్మ, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత విగ్రహప్రతిష్ఠా పనోత్సవాలు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 5 : పెద్దశంకరంపేటలో దుర్గామాత విగ్రహప్రతిష్ఠామహోత్సవాలు రెండోరోజు శుక్రవారం వైభవంగా కొనసాగుతున్నాయి. వేదబ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో గణపతి పూజ, నవగ్రహ, అవాహిత దేవతా మూలమంత్రహవనము, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణా సుభాశ్ గౌడ్, గుజ్జరి కనకరాజు, కందుకూరి రవీందర్, అన్నారం సత్యనారాయణ, సీతారామరావు, సతీశ్‌గౌడ్, రవివర్మ, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

చేగుంట : పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

చేగుంటలో ..

చేగుంట,ఏప్రిల్ 5 : చేగుంట మండల పరిధిలోని కరీంనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి దేవత విగ్రహ, దేవాలయ ప్రతిష్ఠామహోత్సవం మూడు రోజులుగా గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పురోహితులు రఘురాం శర్మ ఆధ్వర్యంలో తన శిష్య బృందంచే భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామంలోని ముదిరాజ్ కుల బాంధవులు అమ్మవారికి ప్రతి ఇంటి నుంచి డప్పు చప్పులతో బాజా భజంత్రితో అమ్మవారి దేవాలయం వరకు బోనాలు తీశారు.

మెదక్ మున్సిపాలిటీ : కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

టీఎన్జీవో భవన్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మెదక్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు బాబూ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నేటి యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వారు సూచించారు.

- మెదక్ జిల్లానెట్‌వర్క్, ఏప్రిల్ 5

చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో దామోదర్

ఓటరుకు 12 రకాల గుర్తింపు కార్డులు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు గుర్తింపు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డు కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వీప్ కార్యాక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రంలో గుర్తింపు ధ్రువీకరణ ఉపయోగపడే వాల్ పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు గుర్తంపు కార్డు, ఆధార్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంక్, తపాలా కార్యాలయ పాస్‌బుక్కు, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, పాటోతో కూడిన పింఛన్ పత్రాలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని కలెక్టర్ వెల్లడించారు. బీఎల్వోలు అందించే ఓటర్ స్లిప్ అనేది పోలింగ్ కేంద్రాల సమాచారం తెలిపేందుకే ఉపయోగపడుతుందని, అది గుర్తింపు కార్డు కాదని అన్నారు. ఈ వాల్ పోస్టర్‌ను అన్ని పోలింగ్ కేంద్రాలలో బహిరంగ ప్రదేశాల్లో అతికించి ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్డీవో పద్మశ్రీ స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, మత్స్యశాఖ అధికారి నరసింహారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

మనోహరాబాద్, ఏప్రిల్ 5 : మండల పరిధి కాళ్లకల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని రావెల్లికి చెందిన బూర్గుల జయరాంరెడ్డి కొంపల్లి నుంచి తూ ప్రాన్‌కు కారులో వెళ్తుండగా కాళ్లకల్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా రూ. 95 వేలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం నగదును స్వాధీనం చేసుకొని రసీదు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

రసీదును అందజేస్తున్న ఎస్సై కరుణాకర్‌రెడ్డి

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

రామాయంపేట, ఏప్రిల్ 5 : రామాయంపేట పట్టణంలోని ఈనెల 17న జరిగే శ్రీ కల్యాణ రామచంద్రస్వామి వేడుకలకు రావాలని రామాయంపేట పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులకు స్వామివారి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. శుక్రవారం కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ కమిటీ పురపాలిక కౌన్సిలర్లు దేమె యాదగిరి, దేవుని జయరాజు, సుందర్‌సింగ్, చిలుక గంగాధర్‌లకు స్వామి వారి ఆహ్వాన పత్రికలను ఆల య కమిటీ అందజేశారు.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు..

పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు

నర్సాపూర్,ఏప్రిల్ 5 : శ్వాస ఉన్నంత వరకు కేసీఆర్‌తోనే నా ప్రయాణం సాగుతుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పుట్టిన రోజు వేడుకలు బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ యువనాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, లేబర్ వెల్ఫర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవెందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, జగదీశ్, వివిధ మండలాల ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, ఏప్రిల్ 5 : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని చిలిపిచెడ్ మండల నాయకులు,ప్రజాప్రతినిధులు ఆమె కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొల్చారం మండల యూత్ అధ్యక్షుడు సంతోశ్‌రావు, బీ ఆర్ఎస్ నాయకుడు నర్సింహులు, మండల నాయకులు ఉన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, ఏప్రిల్ 5 : ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డి పుట్టినరోజు వేడుకలను మాసాయిపేట మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో గ్రామచావిడి వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు నాగరాజు, సిద్దిరాంలు గౌడ్, సొసైటీ డైరెక్టర్ నర్సింహులు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు స్వామి, రమేశ్, శ్రీనివాస్, దుర్గాస్వామి పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, ఏప్రిల్ 5 : మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు అన్ని గ్రామాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం చాకరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకహోమం నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా, జడ్పీ కో–ఆప్షన్ మన్సూర్, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, రాష్ట్ర మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణా గౌడ్, బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, సీనియర్ నాయకులు గొర్రె వెంకట్‌రెడ్డి, గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, చింతస్వామి, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

చాకరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సభలో విద్యుత్ అంతరాయంపై నేతల ఆగ్రహం

పాపన్నపేట, ఏప్రిల్ 5 : పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి లేచి మైక్ అందుకొని ప్రసంగిస్తుండగా కరెంట్ పోయింది. దీంతో కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన... అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో చేసేది ఏమి లేక జనరేటర్ ద్వారా సమావేశాన్ని కొద్ది సేపు నిర్వహించుకోవాల్సి వచ్చింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 5 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి భీమయ్య (45) గురువారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి రాత్రి అయిన ఇంటికి తిరిగిరాలేదు. పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని భీమయ్య మృతిచెందడాన్ని శుక్రవారం ఉదయం గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయాన్ని వెల్దుర్తి పోలీసులకు తెలుపడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం

రామాయంపేట, ఏప్రిల్ 5 : ప్రమాదశాత్తు అటవీప్రాంతంలో అడవికి మంటలు అంటుకున్న సంఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట సెక్షన్ పరిధిలో జరిగింది. అటవీశాఖ బీట్ ఆఫీసర్ రాము కథనం ప్రకారం.. అక్కన్నపేట అటవీప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో బీడీలు తాగి అదే నిప్పురవ్వను అడవిలో పడేసి ఉంటారని అన్నారు. వెంటనే మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. అప్పటికే కొంత మేర అటవీశాఖలో ఉన్న మొక్కలు కాలిపోయాయని అగ్నిమాపక శకటం ద్వారా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించకుండా ఆపగలిగామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర, 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-110

WANTED

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

CHANGE OF NAME

★I, PRERANA NAGNATH PASHETTY, W/o. Nagnath Pashetty, R/o. H.No. 1-91, Chowkanpalle, Kangti, Sangareddy Dist., TS-502 286. I Changed My Name from BIRADAR PRERANA PREMKUMAR to PRERANA NAGNATH PASHETTY as per Aadhar.
NT-313845

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.